క్లుప్తంగా

మే 31 వరకు అపరాల కొనుగోలు

ఏఓ బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: మండలంలో అపరాల కొనుగోలు మే నెల 31 వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా మినుము, పెసర కొనుగోలు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 116 మంది రైతుల నుంచి 1,675 క్వింటాళ్ల అపరాలు కొనుగోలు చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం పెసలు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,682, మినుములు రూ.7,400 ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

బాధితులకు చేయూత



రేపల్లె రూరల్: అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చేయూత నిచ్చారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కారుమూరి శ్రీనివాసరావు పూరిల్లు ఇటీవల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ గురువారం బాధితులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కె.వి.కష్టారెడ్డి, నాయకులు చిమట బాలాజీ, చిత్రాల ఓబేదు, ప్రభు కిరణ్, రాజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కొల్లివర: పంచాయతీరాజ్ యాక్ట్ 1994లో 23వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏప్రిల్ 24న ప్రవేశపెట్టారని, అప్పటి నుంచి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి సమక్షంలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి పంచాయతీరాజ్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మే10లోపు వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్‌లతో పాటు తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

తెనాలిరూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన కావూరి మహేష్ సెల్‌ఫోన్‌ను రిపేర్ చేయించేందుకు గంగానమ్మపేటలోని ఓ సెల్ పాయింట్‌కు ఫిబ్రవరి 26న వెళ్లాడు. తన వాహనాన్ని రోడ్డు వెంబడి పెట్టి దుకాణంలోకి వెళ్లి రాగా వాహనం కనబడలేదు. ఆచూకీ ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను గురువారం ఆశ్రయించగా టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శ్రీమాత' భారతదేశ శాశ్వత ఆగమన దినోత్సవం

తెనాలి: పాండిచ్చేరిలోని శ్రీఅరవింద ఆశ్రమ అధినేత్రి శ్రీమాత పారిస్ నుంచి 1920 ఏప్రిల్ 24న దేశానికి శాశ్వతంగా విచ్చేసి, ఆశ్రమం కేంద్రంగా ప్రపంచంలోని సర్వమానవులకు ఆధ్యాత్మిక పదనిర్దేశం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఇక్కడ వేడుకలను జరిపారు. నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రంలో తొలుత సామూహిక ధ్యానంతో కార్యక్రమాలను ఆరంభించారు. తదుపరి విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. రోజరి కాన్వెంట్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ రెడ్డి శ్రీమాత పతాకాన్ని ఆవిష్కరించారు. 'దివ్య దీపిక' ప్రత్యేక సంచికను విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఎస్.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. విద్యా కేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షత వహించారు. ఎ.అంజనేయులు, సయ్యద్ బాషా, హెచ్ఎం నిర్మలకుమారి పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగలక్ష్మి

కర్లపాలెం: గ్రామ సచివాలయాలతో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం అయ్యిందని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు చెప్పారు. గురువారం మండల పరిధిలోని నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం గ్రామ సచివాలయాల వద్ద జరిగిన గ్రామ సభలకు ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. పరిపాలన సౌలభ్యం కోసం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు మండలాల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ మరింత బలోపేతమై ప్రజలకు మేలు చేకూర్చనుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కొత్త నందాయపాలెం గ్రామ సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, నాయకులు ఆట్ల అయ్యప్పరెడ్డి, మాడా శ్రీనివాసరావు, మునిపల్లి చిన్న గరిగంటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మురళీరెడ్డి, వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

రేపల్లె రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుందని ఎంపీడీవో నాగలక్ష్మి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీఎం మస్తాన్‌రావు, ఎంపీటీసీ నాగర్ ఖాన్, సర్పంచ్ పోలేరమ్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు పాల్పడడం బాధాకరం



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంఘీభావంగా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన ర్యాలీలో గణేష్ పాల్గొని మాట్లాడుతూ దేశ గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా పాక్ ఉగ్ర దాడులకు పాల్పడడం బాధాకరమన్నారు. ఉగ్ర దాడులను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కె.వి.కష్టారెడ్డి, నాయకులు చిమట బాలాజీ, చిత్రాల ఓబేదు, ప్రభు కిరణ్, రాజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంలో స్త్రీల పాత్ర ముఖ్యమైనది



బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ

రేపల్లె రూరల్: హిందూ ధర్మంలో స్త్రీల పాత్ర ముఖ్యమైనదని బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఒకటో వార్డు శ్రీరామ నగర్ ఎస్టీ కాలనీలో నిర్మితమైన సీతారామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజన, సంకీర్తన, సత్సంగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో స్త్రీల పాత్ర ముఖ్యమైనదని ఆదిపరాశక్తిగా, లక్ష్మీదేవిగా, సరస్వతి దేవిగా, కనకదుర్గమ్మగా స్త్రీలను మనం కొలుస్తామని తెలిపారు. గ్రామ రక్షకులుగా గ్రామ దేవతలుగా స్త్రీలను పూజిస్తామని చెప్పారు. హిందూ ధర్మాన్ని, సంప్రదాయాలను కాపాడడంలో స్త్రీల పాత్ర ప్రముఖమైనదని వివరించారు. కార్యక్రమంలో జంజనం హేమ శంకర్‌రావు, పడమట వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, జంగం శ్యాంప్రసాద్, సొంటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



మండల పార్టీ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడికి గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చెరుకుపల్లి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు వరికూటి అశోక్‌బాబుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలన్నారు. కేంద్ర పార్టీ కార్యాలయం వేమూరు నియోజకవర్గంలో ఐదు మండల కమిటీ సభ్యుల పేర్లు ఏప్రిల్ 16వ తేదిన ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు. మండల కమిటీ సభ్యులందరు గ్రామాల్లో పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హిమచంద్ర శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది గుమ్మడి రవిరాజా, మండల కమిటీ సభ్యులు మూల్పూరు కిషోర్, నూతక్కి చేన్న కేశవులు, కూచిపూడి ధనరాజ్, ఆవుతు ముక్త రెడ్డి, తాతా సుబ్బారావు, కట్టుపల్లి రాంబాబు, ఎం.కృష్ణమూర్తి, సంపత్ కొండలు, షేక్ ఖాదర్ బాషా, ఎన్.శ్రీనివాసరరావు, గుర్రం మధు, గాలి రామస్వామి, యడ్లపాటి సూర్యనారయణ, గరికపాటి దానియేలు, కుర్రా రాము, మక్కెన కోటేశ్వరరావు, సిద్దెల ప్రవీణ్, ఎం.శరత్, షేక్ నాగూర్‌వలీ, ఎం.వి జయసాగర్, అమర్తలూరు నరసింహారావు, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అందించాలి

అమర్తలూరు(వేమూరు): ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని విద్యా కమిటీ చైర్మన్ కిషోర్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ పావులూరు వెంకయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావు అధ్యక్షత వహించారు. శంకరరావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామ బడి, మన బడి కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ఎక్కువ పిల్లలను చేర్పించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు ఉన్నత విద్యను అందించడం వల్ల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 509, 506, 502 మార్కులు సాధించడం జరిగిందన్నారు. పదిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండవ విజయలక్ష్మి, మండవ రమేష్, ఉప్పల సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వలోకి బోల్తా కొట్టిన లారీ



తెనాలిరూరల్: టైరు పేలడంతో లారీ అదుపు తప్పి కాల్వలోకి బోల్తా కొట్టిన ఘటన తెనాలి మండలం జాషువానగర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నై నుండి ఉప్పు లోడుతో విజయవాడ వెళుతున్న లారీ నందివెలుగు సమీపంలోకి రాగానే టైరు పేలి అదుపు తప్పింది. తెనాలి-విజయవాడ రహదారి వెంబడి ఉన్న కాల్వలోకి బోల్తా కొట్టింది. లారీలోని డ్రైవరు, క్లీనరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనం వేగంగా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని డ్రైవర్ తెలిపాడు.

దళిత ప్రజాప్రతినిధులకు సత్కారం

తెనాలి టౌన్: భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడంలో బీజేపీ అవిరళ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా గురువారం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళిత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులను సత్కరించారు. ముందుగా తేలప్రోలులోని శతాధిక వృద్ధురాలు వేజండ్ల విశ్రాంతమ్మను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి, అంగలకుదురు మాజీ సర్పంచ్ నలుకుర్తి విజయ, సంగంజాగర్లమూడి మాజీ సర్పంచ్ మాతంగి క్రీస్తు మణిమ్మలను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా వారు చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, ఎం.వీరయ్య, వేజండ్ల రోశయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరించాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి రాధామాధవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జిల్లా అధికారి

రేపల్లె రూరల్: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి డి.రాధామాధవి చెప్పారు. స్థానిక సెక్టార్ కార్యాలయంలో గురువారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేసవికాలంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. 2 సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడంతోపాటు ఐదు సంవత్సరాలు దాటిన చిన్నారులను పాఠశాలలకు పంపేలా అంగన్‌వాడీలు బాధ్యత వహించాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ సురేంద్ర, సీడీపీఓ సుచిత్ర, సూపర్‌వైజర్లు సునీత, నాంచారమ్మ, రజిని, శివజ్యోతి, మంజుల, వెంకటరత్నం, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మే డేని జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

బాపట్ల: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం బాపట్లలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సీఐటీయూ జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని ఘనంగా జిల్లాలో నిర్వహించాలని, 8 గంటల పని విధానం కోసం జరిగిన పోరాట ఫలితంగా మేడే సాధించుకున్నామని గుర్తు చేశారు. నేడు పెట్టుబడుదారులు 8 గంటల పని విధానానికి తిలోదకాలు ఇచ్చి 10 గంటలు 14 గంటలు పని చేయిస్తున్నారని, మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఎల్ అండ్ టీ సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు, ఆదివారాలు కూడా పనిచేయాలని కార్మిక వర్గానికి చెప్పటం అంటే పెట్టుబడిదారుల ధన దాహం ఎలా ఉందో అర్థం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలన్నీ నాలుగు కోడ్స్‌గా మార్చిందని అవి అమల్లోకి వస్తే కార్మికుల హక్కుల్ని కాల రాస్తాయని తెలిపారు. కార్మికులకు సంఘం పెట్టుకునే ప్రాథమిక హక్కు కూడా ఉండదని, దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన సమ్మెకు పిలుపునిస్తున్నాయని చెప్పారు. కార్మికులు మే డే సందర్భంగా మే 20న జరిగే సమ్మెకి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఎం.వసంతరావు, టి.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఎం.బుచ్చిరాజు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిని క్షయవ్యాధి రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



సీవైటీబీ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్‌లు

తెనాలిఅర్బన్: క్షయవ్యాధి రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎయిమ్స్ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ ఉత్కర్ష తివారి పేర్కొన్నారు. నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు గురువారం సీవై టీబీ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ టీ రమేష్ ఆదేశాల మేరకు వీటిని చేస్తున్నట్లు తెలిపారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారికి పరీక్షలు చేస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీలు దిలీప్ కుమార్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

'మలినేని' డేటాసైన్స్ విభాగాధిపతికి పీహెచ్‌డీ



ఎస్.హరికృష్ణ

ప్రత్తిపాడు: మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగాధిపతి ఎస్.హరికృష్ణకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా ప్రధానం చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఏఎన్‌యూలో గైడ్ రామినేని శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో 'నావెల్ అల్గారిథమ్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ సెక్యూరిటీ ఇన్ సీక్రెట్ కీ జనరేషన్ త్రూ ది కాంప్రిహెన్సివ్ బి.బి84 క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ ప్రోటోకాల్'పై థీసెస్ రూపొందించి సమర్పించారు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో యూనివర్సిటీ వీసీ కె.గంగాధర్, ప్యానెల్ సభ్యులు హరికృష్ణకు పట్టాను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, డీన్ పి.రమేష్ బాబు ఆయా శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతిభ



తృతీయ స్థానం పొందిన బృంద సభ్యులతో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి

తాడేపల్లి రూరల్: ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ ఘజియాబాద్‌లో నిర్వహించిన ఫైనల్ కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్) బృందం ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించినట్లు ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా 8 టీమ్‌లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల టీమ్‌లతో పోటీపడి వారికి దీటైన పోటీ ఇచ్చి తృతీయ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. బృందం సభ్యులను రాష్ట్ర డి.జీ.పి హరీష్‌కుమార్ గుప్త, పలువురు ఐజీలు, పోలీస్ విభాగ అధికారులు అభినందించారు.

కరిముల్లా బాబా 16వ ఉరుసు గంధ మహోత్సవం రేపు



విద్యుత్ కాంతుల అలంకరణలో పెదకాకాని కరిముల్లా బాబా నిషాని

పెదకాకాని: కరిముల్లా బాబా 16వ ఉరుసు గంధ మహోత్సవం శనివారం నుంచి ఘనంగా ప్రారంభమవుతుందని దర్గా నిషాని వ్యవస్థాపకుడు పఠాన్ మహబూబ్ సుభాని తెలిపారు. పెదకాకాని గ్రామంలోని బాజీనగర్‌లో వెలసిన కరిముల్లా షా ఖాదరి నిషాని వద్ద గురువారం ధర్మకర్త పఠాన్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ.. 3 రోజుల ఉరుసు మహోత్సవంలో భాగంగా 26న రాత్రి కంబల్ ఫాతేహా, 27వ తేదీ రాత్రి 10 గంటలకు పెదకాకానిలోని దర్గా నుంచి గంధం, గుర్రం బయలుదేరు కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు సలామి ప్రార్థనలు, ఖురాన్ పఠనము, అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా శనివారం మధ్యాహ్నం లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కెనడి తెలిపారు. 2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు కేటాయించాలని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం



తెనాలి: స్థానిక గాంధీనగర్‌లోని శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రంలో 348వ ఉచిత యోగ శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. యోగ గురువు కూనల బాపలాల్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజూ యోగ చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని చెప్పారు. సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉచిత యోగ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూర్యోదయానికి ముందే యోగ చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఆర్.భార్గవ్, యోగ సభ్యులు పాల్గొన్నారు.

జనజీవన జాగృతి జగ్జీవన్‌రామ్



పోస్టర్ ఆవిష్కరించిన మేకల సురేష్. పక్కన దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్, కృష్ణమోహన్

తెనాలి: జనజీవన జాగృతి భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవనరామ్ అని బీజేఆర్ (బాబు జగ్జీవన్‌రామ్) కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లో గురువారం బాబు జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ నిర్మాణంలో ఉన్న నేపథ్యంలో బీజేఆర్ కమిటీ సారథ్యంలో బీజేఆర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గౌరవఅతిథిగా పాల్గొన్న చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ 2025లోనే జగ్జీవన్‌రామ్ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాల్లో ఉన్నట్టు చెప్పారు. జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పాత్ర పోషించే అవకాశం రావటం తన అదృష్టమన్నారు. రావి కృష్ణమోహన్ (చిన్ని), బీజేఆర్ కమిటీ సభ్యులు బడుగు సురేష్, గాజుల వట్టి రాజేష్, చిలక రత్నరాజు, జితేంద్ర, కోట లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పట్టణ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పూలే కాలనీ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతున్నారని రూరల్ పోలీసులకు గురువారం రాత్రి సమాచారమందింది. ఎస్ఐ కె.ఆనంద్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించి నలుగురు జూదరులను, అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్‌లు, రూ.14,500 స్వాధీనపర్చుకున్నారు.

నేడు స్ట్రోక్‌పై ప్రత్యేక కార్యక్రమం

గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సహకారంతో స్ట్రోక్‌పై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ముఖ్య అతిథిగా, అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ, సెక్రటరీ డాక్టర్ అరవింద్ శర్మ గౌరవ అతిథులుగా విచ్చేస్తున్నట్లు రొటేరియన్ సత్యనారాయణ తెలిపారు. గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో ఉదయం 8.30 గంటలకు చెక్ బీపీ-స్టాప్ స్ట్రోక్ నినాదంతో కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.